ప్రజాశక్తి
గురువారం 2 జనవరి, 2025
5
శ్రీకాకుళం



397 మంది ఎంపిక

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో సివిల్, ఎపిఎస్‌పి పోలీసు కానిస్టేబుల్ ఎంపికలో భాగంగా అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు రెండు రోజులు సోమ, మంగళవారాలు నిర్వహించారు. ఈ రెండు రోజుల్లో కలిపి సుమారు 1199 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు హాజరు కావలసి ఉండగా, మొదటి రోజు 322, రెండో రోజు 409, మొత్తానికి 731 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరులో సోమవారం 192 మంది, మంగళవారం 205 మంది మొత్తానికి 397 మంది అభ్యర్థులు ఛాతీ, ఎత్తు, లాంగ్ జంప్, 1600, 100 పరుగులో అర్హత సాధించారు. ఈ దేహదారుఢ్య పరీక్షలు గత నెల 30 నుంచి ఈ నెల 18 వరకు సెలవు దినల్లో మినహా నిర్వహిస్తామని ఎస్‌పి మహేశ్వర రెడ్డి తెలిపారు.

తెగ తాగారు



- కొత్త సంవత్సరం వేడుకల్లో భారీగా మద్యం విక్రయాలు
- డిసెంబరు 30న రూ.5.91 కోట్ల ఆదాయం
- మరుసటి రోజు రూ.4.28 కోట్లు
- గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు రూ.123.18 కోట్ల రాబడి

నూతన సంవత్సర వేడుకల్లో మద్యం పరవళ్లు తొక్కింది. కొత్త సంవత్సరం పేరుతో గతేడాది డిసెంబరు చివరి రెండు రోజులూ మందుబాబులు పండగ చేసుకున్నారు. మద్యం ప్రియులకు మందు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం డిసెంబరు 31తో పాటు కొత్త సంవత్సరం రోజైన బుధవారం రాత్రి ఒంటి గంట వరకు దుకాణాలకు అనుమతించింది. మందుబాబులు మాత్రం మందు విషయంలో ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో గతేడాది డిసెంబరు 30న రికార్డు స్థాయిలో అమ్మకాలు సాగాయి. ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లావ్యాప్తంగా 158 మద్యం షాపులు, 17 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఎప్పటి మాదిరిగానే కొత్త సంవత్సరం వేడుకల పేరుతో మందుబాబులు తెగ తాగారు. సాధారణంగా ప్రతి సంవత్సరం ఏడాది చివరి రోజైన డిసెంబరు 31న భారీగా మద్యం అమ్మకాలు సాగుతూ ఉంటాయి. ఈ ఏడాది మాత్రం డిసెంబరు 30నే అత్యధికంగా మద్యం కేసులు అమ్ముడుపోయాయి. గతేడాది డిసెంబరు 30న 8,516 ఐఎంఎల్ కేసులు, 2,574 బీరు కేసులు విక్రయాలు సాగాయి. అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి రూ.5.93 కోట్ల ఆదాయం సమకూరింది. డిసెంబర్ 31న 6,084 ఐఎంఎల్ కేసులు, 2,619 బీరు కేసులు అమ్ముడుపోయాయి. వీటి ద్వారా రూ.4.28 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన 3,018 ఐఎంఎల్ కేసులు, 560 బీరు కేసులు విక్రయాలు జరిగాయి. వీటి ద్వారా రూ.2.10 కోట్ల ఆదాయం సమకూరింది.

గతేడాది అమ్మకాలు ఇలా...

కొత్త జిల్లాల ఏర్పాటు జరిగినా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో విభజన పూర్తి కాకపోవడంతో ఆ శాఖలో ఉమ్మడి జిల్లా ప్రతిపాదిన అడ్మినిస్ట్రేషన్ సాగింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 192 మద్యం షాపులు, 23 బార్లు ఉన్నాయి. గతేడాది డిసెంబరు 31న 6,535 ఐఎంఎల్ కేసులు, 2,804 బీరు కేసులు అమ్ముడైపోయాయి. అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి రూ.6.04 కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లా నుంచి పాలకొండ, రాజాం సర్కిల్స్ విడిపోయినా దాదాపు అంతే మొత్తం (రూ.5.93 కోట్లు) ఆదాయం రావడం విశేషం.

ఒకటో తేదీన పడిపోయిన మద్యం అమ్మకాలు

నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో మద్యం అమ్మకాలు పెరుగుతాయని ప్రభుత్వం భావించింది. అమ్మకాలు పరిశీలిస్తే ప్రభుత్వ అంచనాలు తలకిందులయ్యాయి. జనవరి ఒకటో తేదీన కేవలం 3,018 ఐఎంఎల్ కేసులు, 560 బీరు కేసులు అమ్ముడైపోయాయి. అమ్మకాల ద్వారా రూ.2.10 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది.

గతేడాది అమ్మకాల పరిస్థితి ఇలా...

గతేడాది జనవరి ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 31 వరకు సాగిన అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి రూ.123.18 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఏడాది కాలంలో 1,46,978 ఐఎంఎల్ కేసులు, 38,766 బీరు కేసులు అమ్ముడైపోయాయి. శ్రీకాకుళం సర్కిల్‌లో అత్యధిక మద్యం కేసులు అమ్ముడైపోవడంతో పాటు భారీగా ఆదాయం సమకూరింది. ఇక్కడ 35,484 ఐఎంఎల్ కేసులు, 11,200 బీరు కేసులు అమ్మకాలు జరిగి రూ.31.31 కోట్ల ఆదాయం వచ్చింది. రణస్థలం సర్కిల్‌లో 13.08 కోట్ల ఆదాయం వచ్చింది.కోటబొమ్మాళి, నరసన్నపేట, సర్కిల్స్‌లో రూ.100 కోట్లకు పైబడి రాబడి వచ్చింది. ఇచ్ఛాపురం సర్కిల్‌లో అత్యల్పంగా రూ.3.52 కోట్ల ఆదాయం సమకూరింది.

కొత్త సంవత్సర కోలాహలం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, కోటబొమ్మాళి, కవిటి

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఆనందోత్సాహాల నడుమ కోలాహలంగా సాగాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ గతేడాది తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఇతర ప్రజాప్రతినిధులను కలిసేందుకు వారి అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ బారులు తీరారు. కలెక్టర్, ఎస్‌పి, జాయింట్ కలెక్టర్‌ను కలిసేందుకు అధికారులు, పలు శాఖల సిబ్బంది రాకపోకలతో వారి బంగ్లాల వద్ద సందడి నెలకొంది.

మంగళవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత శ్రీకాకుళం నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా యువత కేరింతలు కొడుతూ బాణాసంచా కాల్చి, ఆటపాటలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. కొన్ని కాలనీలు, అపార్ట్‌మెంట్లలో డిజిటల్ సౌండ్ సిస్టమ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహంగా గడిపారు. బుధవారం ఉదయం నుంచి అధికారులు, సిబ్బంది, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల హడావుడి మొదలైంది. అన్ని స్థాయిల వారూ తమపై అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కవిటి : కేక్ కట్ చేస్తున్న విప్ అశోక్



కోటబొమ్మాళి : కేంద్ర, రాష్ట్ర మంత్రులకు శుభాకాంక్షలు చెప్తున్న కలెక్టర్, ఎస్‌పి, జెసి తదితరులు

కార్యాలయాల వద్ద కోలాహలం

కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు స్వగ్రామమైన కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. మంత్రులకు శుభాకాంక్షలు తెలిపేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికారులు, నాయకులు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వారి నుంచి పూలబొకేలు, శాలువాలకు బదులుగా పుస్తకాలు, పెన్నులు, మొక్కలు, కూరగాయలు స్వీకరించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, ఎన్.ఈశ్వరరావు తదితరులు మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కవిటి మండలం రామయ్యపుట్టుగలోని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, బల్లిపుట్టుగలో జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ కార్యాలయాలకు పెద్దసంఖ్యలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు బారులు తీరారు. వీరితోపాటు ఇతర అధికారులు, అనధికారులు, నాయకులు, కార్యకర్తలు వీరికి శుభాకాంక్షలు తెలియజేసేందుకు తరలివచ్చారు. వందలాది మంది తరలిరావడంతో గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. వచ్చిన వారందరికీ కరచాలనం చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో కోలాహలంగా మారాయి.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను కలుసుకునేందుకు జిల్లా అధికారులు, అనధికారులు తరలివచ్చారు. ఉదయం పది గంటల నుంచే అతిథులతో కలెక్టర్ బంగ్లా కళకళలాడింది. ఏటా మాదిరిగానే కలెక్టర్‌ను ఎన్‌జిఒలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డిని పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, అనధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



కోటబొమ్మాళి : అభిమానులతో కరచాలనం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయు

రెక్కల కష్టం బుగ్గిపాలు

- నాలుగు ఎకరాల వరి పంట దగ్ధం
- నూతన సంవత్సర వేళ విషాదం



దగ్ధమవుతున్న వరి కుప్పలు

ప్రజాశక్తి - పాతపట్నం

మంగళవారం రాత్రి 11 గంటల సమయం... మహిళలు ఇళ్ల ముందు ముగ్గులు వేస్తూ, యువత కేరింతలు కొడుతూ ఇలా అందరూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే హడావుడిలో ఉన్నారు. ఇంతలో ఒక్కసారిగా అలజడి, పొలాల్లో వరి కుప్పలు కాలిపోతున్నాయని... పరుగులు తీసి మంటలార్పేసరికే బుగ్గి తప్ప ఇంకేం మిగల్లేదు. ఏడాది రెక్కల కష్టం బుగ్గిపాలు కావడంతో ఆ రైతుల రోదన ఆపడం ఎవరితరం కాలేదు. నూతన సంవత్సర వేళ ఈ విషాద ఘటన మండలంలోని బడ్డుమర్రిలో చోటుచేసుకుంది.

బడ్డుమర్రిలో మంగళవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కుడుతూరు జోగారావు, పడాల సీతారామమ్మకు చెందిన నాలుగు ఎకరాల వరి కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. రాజన్నపేట యువకులు బడ్డుమర్రి గ్రామానికి వెళ్తుండగా వరి కుప్పలు కాలిపోతుండడాన్ని చూసి, ఆ గ్రామస్తులకు సమాచారం అందించారు. స్థానికులు పరుగున వెళ్లి చెరువులోని నీళ్లతో మంటలార్పేందుకు విఫలయత్నం చేశారు. మంటలు ఎగసిపడుతుండడంతో టెక్కలి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక శకటం చేరుకుని మంటలు ఆర్పేసరికే వరి కుప్పలు మొత్తం బూడిదయ్యాయి. కుడుతూరు జోగారావుకు రెండు ఎకరాల సొంత భూమి కాగా, పడాల సీతారామమ్మ కౌలు రైతు. రెండు ఎకరాలు తీసుకుని కౌలుకు సాగు చేస్తోంది. పంట పెట్టుబడికి ఎకరానికి రూ.25 వేల వరకు అప్పులు చేసి మరీ పెట్టుబడి పెట్టామని, పంట చేతికొచ్చాక నోటికాడికి రాకుండా పోయిందని గుండెలు బాదుకుని విలపిస్తున్న తీరు అక్కడున్న వారినీ కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న ఆర్ఐ బాబీ, విఆర్ఒ మురళి ఘటనాస్థలిని బుధవారం ఉదయం పరిశీలించారు. సుమారు రూ.రెండు లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని స్థానికులు చెప్తున్నారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు.



పరిశీలిస్తున్న అధికారులు

రథసప్తమి ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో వచ్చే నెల 2 నుంచి నాలుగో తేదీ వరకు నిర్వహించనున్న రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం క్షేత్ర పరిశీలన చేశారు. ఆలయ పరిసరాలను పరిశీలించి వేడుకలకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండగగా ప్రకటించడంతో ప్రతిష్టను పెంచే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా క్షేత్ర పరిశీలన చేసి వేడుకల నిర్వహణకు అవసరమైన ప్రదేశాలను గుర్తించారు. యాత్రికులకు తాగునీరు, పారిశుధ్యం, క్యూలైన్లు, ప్రసాదాల పంపిణీ, ప్రవేశ మార్గాలు, పార్కింగ్ స్థలాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అత్యవసర సమయంలో యాత్రికులకు అసౌకర్యం కలగకుండా డమ్మీ లైను ఏర్పాటు చేసేందుకు సూచనలు చేశారు. ఎక్కడికక్కడ వైద్య బృందాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేందుకు అవసరమైన ప్రదేశాలను గుర్తించారు. కేశఖండనశాలను తాత్కాలికంగా అరసవల్లి మున్సిపల్ హైస్కూల్‌కు మార్చాలని సూచించారు. ఆలయ ప్రవేశంతో పాటు యాత్రికులు బయటకు వెళ్లే మార్గాలను పరిశీలించారు. క్షేత్ర పరిశీలనలో గుర్తించిన అంశాలపై ఉన్నతస్థాయిలో చర్చించి పనులు మొదలుపెట్టేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, అరసవల్లి ఆలయ ఇఒ వై.భద్రాజీ, ఆర్‌డిఒలు సాయి ప్రత్యూష, రమణమూర్తి, జి.వెంకటేష్, ఉప కలెక్టర్ పద్మావతి, డిఎస్‌పి వివేకానంద, ఆర్ అండ్ బి ఎస్ఇ జాన్ సుధాకర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.వి.వి.ప్రసాద్ పాల్గొన్నారు.



అరసవల్లి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు

నేడు అభిప్రాయ సేకరణ

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించనున్న రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు ఎమ్మెల్యే గొండు శంకర్ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ విలువైన సూచనలు, సలహాలను అందించాలని కోరారు.

7 వరకు ఎస్‌సి కులగణనపై అభ్యంతరాల స్వీకరణ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం అర్బన్ : ఎస్‌సి కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును ఈనెల ఏడో తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 31వ తేదీతో గడువు ముగియడంతో, మరో వారం రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఎసిపి విధివిధానాలు తెలుపుతూ 265 నంబరు జిఒ విడుదల చేసినట్లు తెలిపారు. ఈనెల 7వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ఈనెల 11వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని తెలిపారు. అనంతరం అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 17వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని తెలిపారు.

అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం: భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, పదో తరగతి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల నుంచి 2025 జనవరి 7 నుంచి 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 2005 జనవరి ఒకటో తేదీ నుండి 2008 జూలై ఒకటి మధ్య పుట్టిన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ పరీక్షకు మూడు రోజుల ముందు అర్హత పరీక్ష అడ్మిట్ కార్డులు అభ్యర్థుల వ్యక్తిగత ఈ-మెయిల్‌కు వస్తాయని తెలిపారు. మరిన్ని వివరాలకు భారత వాయుసేన వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం: స్టైపండరీ పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పారదర్శకంగా జరుగుతుందని, ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారుల మాటను నమ్మి మోసపోవద్దని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నేతృత్వాన నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ నిబంధనల మేరకు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. శారీరక దేహ దారుఢ్య పరీక్షలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ, సామర్థ్యాన్ని బట్టి ఎచ్చెర్ల పోలీస్ ఆర్మ్డ్ రిజర్వు మైదానంలో శారీరక దేహ దారుఢ్య పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని, డబ్బులు ఇవ్వాలని చెప్తే వారి సమాచారాన్ని స్థానిక పోలీసులకు గానీ 63099 90800, 6309990911 ఫోన్ నంబర్లకు గానీ తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. దళారులు, మాయమాటలు చెప్పే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు కాల్ లెటర్‌లో తెలిపిన నిర్దేశించిన తేదీ సమయానికి ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్సు కాపీతో హాజరు కావాలని తెలిపారు.

మంచినీళ్లపేట తీరంలో తాబేళ్లు మృతి



ఒడ్డుకు కొట్టుకొచ్చిన తాబేలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని మంచినీళ్లపేట సముద్ర తీరంలో బుధవారం అలివ్ రిడ్లే తాబేళ్లు పదుల సంఖ్యలో మృతి చెంది తీరానికి కొట్టుకొచ్చాయి. సముద్ర జలాల్లో కాలుష్య నివారణలో అలివ్ రిడ్లే తాబేళ్లు ప్రధాన భూమిక పోషిస్తాయి. సముద్ర జలాల్లో మృత్యువాత పడి తీరానికి కొట్టుకొని రావడంపై మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. గుడ్లు పెట్టడానికి సముద్ర ఒడ్డుకి వచ్చే క్రమంలో బోట్లు దెబ్బకు మృత్యువాత పడుచున్నారని అభిప్రాయం వ్యక్తమవుతుంది. అలివ్ రిడ్లే తాబేళ్లను సంరక్షించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. అలివ్ రిడ్లే తాబేళ్లు అంతరిస్తే సముద్ర జలాలు కాలుష్య కోరల్లోకి కూరుకుపోయి భవిష్యత్‌లో మత్స్య సంపద లభించని పరిస్థితి దాపురిస్తుందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ, మత్స్య శాఖ అధికారులు దృష్టి సారించి అలివ్ రిడ్లే తాబేళ్లను సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రహదారుల నిర్మాణం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని డోకులపాడు నుంచి సముద్ర తీరం వరకు నిర్మించిన బిటి రోడ్డును బుధవారం ప్రారంభించారు. అనంతరం మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో ఈ రోడ్డును నిర్మించామన్నారు. రూ.90 లక్షలతో 1.4 కిలోమీటర్ల మేరకు నిర్మించినట్లు తెలిపారు.

అధికారుల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. పంచాయతీలకు వచ్చిన నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించారు. కార్యక్రమంలో అగ్ని కుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు సురాడ మోహనరావు, దున్న షణ్ముఖరావు, చింత నారాయణ, కర్ని రమణ, దశ్యంత్, గణపతి, మద్దు రమేష్, ఎంపిడిఒ రమేష్‌నాయుడు, డిఇ రవిబాబు, ఎఇ నాగభూషణం పాల్గొన్నారు.




ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

మార్కెట్ కమిటీల నియామకానికి సన్నాహాలు

- రూల్ ఆఫ్ రిజర్వేషన్ కోసం ఆదేశాలు
- ఒక్కో పదవికి పది మంది వరకు ఆశావహులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలకు పాలకవర్గాల నియామకం పూర్తి కాలేదు. నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న ఆశావహులు ఎదురుచూస్తున్నారు. రైతులు పండించిన ఉత్పత్తులు మార్కెట్ యార్డులకు వస్తున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ పంట కోతల ప్రక్రియ కూడా దాదాపుగా పూర్తయింది. మార్కెట్ కమిటీలకు ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు ఇదే మంచి కాలం. రబీలో జిల్లావ్యాప్తంగా మిర్చి, అపరాలు, ఉద్యాన పంటలు అందుబాటులోకి రానున్నాయి. మొత్తమ్మీద మార్కెట్ కమిటీల్లో వ్యాపార కార్యకలాపాలు ఊపందుకుంటున్న సమయం కావడంతో, పాలకవర్గాల్లేక పర్సన్ ఇన్‌ఛార్జీలుగా కార్యదర్శులే కొనసాగుతున్నారు. జిల్లాలో వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందువల్ల మార్కెట్ కమిటీల్లో తనకు అనుకూలమైన వారిని నియమించే అవకాశాలు ఉన్నాయని ఆశావహులు అతని వద్దకు క్యూ కడుతున్నారు.



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మార్కెట్ కమిటీల చైర్మన్ల కోసం జిల్లా యూనిట్‌గా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఖరారు చేయాలని ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. ఇందులో జనరల్, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు, మహిళలు, అన్ని వర్గాల వారికి చోటు ఉండేలా రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిర్ధారించాలని ప్రభుత్వం బావిస్తోంది. ఈ కమిటీల్లో నూ మిగిలిన పదవుల తరవాతలో నే టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు చోటు దక్కనుంది. అందువల్ల మూడు పార్టీల నాయకులు ఆశావహుల్లో ఉన్నారు. గతంలో ఇచ్చిన కార్పొరేషన్ పదవుల్లో ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని, ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యత ఇచ్చారన్న విమర్శలు జిల్లా నాయకత్వం ఎదుర్కొంటోంది. ప్రాధాన్యత లేని పోస్టుల్లో అవకాశమిచ్చారని కొందరు ఇప్పటికీ గుర్రుమీద ఉన్నారు. కొందరు ఎమ్మెల్యేల సిఫార్సులు సైతం పట్టించుకోలేదన్న అసహనం ఉంది. దీంతో ఎక్కువ పదవులున్న వ్యవసాయ మార్కెట్ కమిటీలపైనే అందరి చూపులు ఉన్నాయి. గడిచిన ఐదేళ్ల పార్టీ కార్యక్రమాల నిర్వహణకు భారీ మొత్తాల్లో ఖర్చు పెట్టిన వారు ఈ పదవులను ఆశిస్తున్నారు. జిల్లాలో 13 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఒక్కో మార్కెట్ కమిటీకి పది మంది వరకు ఆశపడుతున్నారు. అందులో కోటబొమ్మాళి మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో ఉంది. నరసన్నపేట పరిధిలో నరసన్నపేట, జలుమూరు, ఎచ్చెర్ల పరిధిలో ఎచ్చెర్ల, రణస్థలం... ఆమదాలవలస పరిధిలో పొందూరు, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గంలో పాతపట్నం, హిరమండలం, పలాస, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి, ఇచ్ఛాపురంలో కంచిలి, ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో కొత్త పాలకవర్గాలు రానున్నాయి.

ఆశావహుల్లో చిగురిస్తున్న ఆశలు

మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామకం అధినాయకత్వం మూడు పార్టీలకు ప్రాధాన్యత ఇస్తారని భావిస్తున్నారు. చైర్మన్ పదవులు ఆశిస్తున్న వారంతా ఎమ్మెల్యేలకు దగ్గరగా ఉన్న వారే. వారిలో మంత్రి అచ్చెన్నాయుడికి వీర విధేయత ఉన్న వారే ఈ పదవులు దక్కించుకునే అవకాశం ఉందని చర్చ నడుస్తోంది. ఇప్పటికే ఈ పదవుల కోసం మంత్రి వద్ద ముచ్చటించిన వారు లేకపోలేదు. ఒక్కో పాలకవర్గంలో చైర్మన్‌తో పాటు 15 మంది వరకు సభ్యులు ఉంటారు. మిగిలిన పదవుల పంపకం తరహాలోనే అగ్రభాగం టిడిపికే దక్కుతుందని భావిస్తున్నారు. 2:1 నిష్పత్తిలో జనసేన, బిజెపి దక్కించుకోనున్నారు. రెండేళ్ల కాలపరిమితితో పాటు రొటేషన్ ప్రాతిపదికన రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఖరారు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.


చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న గణపతి, ఆనందరావు

రామారావు ఆశయాన్ని సాధిద్దాం

ప్రజాశక్తి- పలాస

ప్రజాశక్తి డివిజన్ ఆర్గనైజర్గా పనిచేస్తూ మృతి చెందిన జె.రామారావు ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సిపిఎం నాయకులు బి.ఆనందరావు అన్నారు. కాశీబుగ్గ సిపిఎం కార్యాలయంలో బుధవారం రామారావు 8వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరాడంబరంగా, నిజాయితీగా ప్రజాశక్తికి, సిపిఎం పార్టీకి సేవలు అందించిన వ్యక్తి రామారావు అని కొనియాడారు. ప్రస్తుత పరిస్థితిలో ప్రజాస్వామ్య హక్కులు కోసం, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా, రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేయడం ద్వారా, అందుకోసం బలమైన ప్రజా పోరాటాలు నిర్వహించడం ద్వారా ఆయన ఆశయాలు సాధించగలమని అన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి రిపోర్టర్ జె.భాస్కరరావు, ఎన్.డిల్లేశ్వర, బి.సుగుణావతి, జి.జ్యోతి, జె.భాగ్యలక్ష్మి, జె.తరుణ్ పాల్గొన్నారు.


పురుషోత్తం నాయుడును అభినందిస్తున్న చంద్రబాబు

సిఎంను కలిసిన పురుషోత్తం నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎపిఎన్జిఒ పూర్వపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వాణిజ్య పన్నులశాఖ అధికారి చౌదరి పురుషోత్తం నాయుడు బుధవారం విజయవాడలోని టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన ఆయనను చంద్రబాబు శాలువ కప్పి సత్కరించారు. భవిష్యత్లో రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు ఎపిఎన్జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.వి శివారెడ్డి, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ సిఎంను కలిశారు.

డాక్టర్ సిమ్మన్నకు సత్కారం

శ్రీకాకుళం అర్బన్: మూడు దశాబ్దాలుగా నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రామీణ ప్రాంతాల పేదలకు వైద్యసేవలు అందిస్తున్న పేదల వైద్యులు డాక్టర్ వండాన సిమ్మన్న అని పలువురు కొనియాడారు. బుధవారం లైన్స్క్లబ్ ఆఫ్ హర్షవల్లి, స్టార్ వాకర్స్ క్లబ్లు సంయుక్తంగా ఆయనను సత్కరించారు. వైద్య వృత్తి వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో నిస్వార్థ సేవలు అందిస్తూ కార్పొరేట్ వైద్యానికి ధీటుగా డాక్టర్ సిమ్మన్న సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధి శాసపు జోగినాయుడు, లయన్స్క్లబ్ ఆఫ్ హర్షవల్లి అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథంనాయుడు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఎం.మల్లిబాబు, అప్పారావు, పి.కుర్మారావు పాల్గొన్నారు.


పోస్టర్ను ఆవిష్కరిస్తున్న లింగరాజు

పోస్టర్ ఆవిష్కరణ

పోలాకి : ఈ నెల 5,6,7,8 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవాల మహాసభలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు స్వర్ణోత్సవ పోస్టర్ను ఎంఇఒ-2 టింగరాజు బుధవారం పోస్టర్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజేష్, పి.ఉమాభాస్కర్ పాల్గొన్నారు.


రాపాకలో కషాయాలు తయారు చేస్తున్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- పొందూరు

ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులతో అధిక దిగుబడులను సాధించవచ్చునని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి పి.రేవతి అన్నారు. మండలం రాపాకలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, శిక్షణా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విషముషడి, బ్రహ్మాస్త్రం, కోడిగుడ్లు, నిమ్మరసం ద్రావణాన్ని తయారు చేశారు. మొక్కజొన్న, మిరప, కాయగూరలు పంటల్లో వచ్చే కత్తిరి పురుగు, కాండం తొలుచు పురుగు, రసం పీల్చు పురుగుల నివారణకు ఈ ద్రావణం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులకు సూచించారు. నార్త్ కోస్టల్ రీజనల్ అధికారులు ప్రకాశరావు, హేమ సుందర్, సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, కృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జన 'సంద్రం'

ప్రజాశక్తి- కవిటి:

నూతన సంవత్సర వేడుకల సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్ద తేడాలేకుండా అందరూ ఏకమవడంతో ఆనందోత్సవాలు వెల్లువిరిశాయి. ఆడారు, పాడారు, సరదాగా సంద్రంలో తడిశారు. ఆంగ్ల సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ, ఆనందోత్సవాల వేడుకలకు వేదికైన మండలం పుక్కళ్లపాలెం, కపాసుకుద్ది తీరం జన 'సంద్రం'గా మారింది.


తీరంలో పర్యాటకులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


శ్రీకాకుళం అర్బన్ : శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ను అభిమానులు, నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలపడానికి రావడంతో ప్రధాన రహదారిపై వాహనాలను... ఈ తంతో పోలీసులు చేసేదేమీ లేక పట్టణంలోని వన్ వే జంక్షన్ వద్ద ప్రధాన రహదారి గుండా వెళ్లాల్సిన వాహనాలను కంచరపేట తహశీల్దార్ కార్యాలయం మార్గం ద్వారా రాకపోకలకు అనుమతించారు.

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవి కుమార్ బొడ్డేపల్లిపేటలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయం వద్దకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, మాజీ మున్సిపల్ చైర్మన్ బొడ్డేపల్లి రమేష్కు శుభాకాంక్షలు తెలిపేందుకు మెట్టక్కివలసలోని వారి స్వగృహం వద్దకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేరుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ, వైసిపి నాయకుడు కోట గోవిందరావు, జనసేన కన్వీనర్ పేడాద రామ్మోహన్ కార్యాలయాల వద్ద అభిమానులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల జిల్లా టిడిపి కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించారు. ముందుగా ఎన్టిఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే గొండు శంకర్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం వివిధ ప్రభుత్వ ఉద్యోగులు, టిడిపి నియోజకవర్గ నాయకులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

జూనియర్ చాంబర్స్ ఇంటర్నేషనల్ (జెసిఐ) మెయిన్స్ ఆధ్వర్యాన నగరంలోని చైతన్య సహకార జూనియర్ కళాశాలలో న్యూఇయర్ వేడుకలు నిర్వహించారు. జెసిఐ వ్యవస్థాపక అధ్యక్షులు జామి భీమశంకర్ హాజరై కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెసిఐ మెయిన్స్ అధ్యక్షులు కూన అనిల్, పోషక్ కుమార్, జగదీష్, రౌతు శ్రీనివాసరావు, వి.టి.నాయుడు, సంపత్, కిరణ్, భాగ్యలక్ష్మి, జయంతి తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: ఎచ్చెర్ల ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బంటుపల్లి సర్పంచ్ ఎస్.రజని ఆధ్వర్యంలో కేక్కట్ చేశారు.

కవిటి: నూతన సంవత్సర వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొత్తపట్నంలో ఎమ్మెల్యే నర్తు రామారావు, సిబ్బందిలో ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్కు అధికారులు, నాయకులు, స్థానికులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సర్పంచ్లు, మండల అధికారులు పలువురు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

పోలాకి: మండలంలోని మబగాంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఇంటికి కార్యకర్తలు, అధికారులు చేరుకుని పుష్పగుచ్ఛాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పీడీవలసలో ఎంపిపి ముద్దాడ దమయంతి, బైరాగినాయుడు, మాజీ ఎంపిపి తమ్మినేని భూషణరావు, డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డోల జగన్కు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

పలాస : ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీష, మాజీ మంత్రి శివాజీకి, నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరికు ఏపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, సతీమణి వజ్జ గంగా భవాని, సూర్యతేజ కళాశాల నిర్వాహకులు దానేటి కామేశ్వరరావు, దానేటి పద్మజ, సాయిశిరీష పాఠశాల నిర్వాహకులు కరిమి రేణుకేశ్వరరావు, భారతి, వైద్యులు పొందల జగదీష్, బెందాళం కళింది, తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఓ వసంతకుమార్, మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, మండల పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, పోలీసులు తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కాశీబుగ్గ జీవంణ కాలనీలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. అప్పలరాజు, భార్య శ్రీదేవి వైసిపి నాయకుల నడుమ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పలాస తన స్వగృహంలో ఏపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, టిడిపి సీనియర్ నాయకులు లొడగల కామేశ్వరరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్, వైద్యులు మల్లేశ్వరరావు, బి.బాలకృష్ణ, కూన మోహన్బాబు వారి నివాసగృహాలు, ఆస్పత్రులు, కార్యాలయాల వద్ద నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు.

పాతపట్నం: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి కార్యకర్తలు, అధికారులు తరలివచ్చి ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు నూతన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువలతో సన్మానించారు.

కొత్తూరు : మండలంలో మాతలలో టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణకు కార్యకర్తలు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, మండల కేంద్రంలో టిడిపి నాయకులు, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావుకు, కుంటిభద్రలో మాజీ వైస్ ఎంపిపి అగతముడి బైరాగినాయుడులకు నూతన శుభాకాంక్షలు తెలిపారు.

టెక్కలి రూరల్ : వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్కు వైసిపి నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ


ఆమదాలవలస : శుభాకాంక్షలు తెలుపుతున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

పంచిపెట్టారు. అలాగే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కూడా నూతన సంవత్సర సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మెళియాపుట్టి : నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా యువత, చిన్నారులు ఉత్సాహంగా మంగళవారం రాత్రి నుంచే గడిపారు. తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండాలకు ఆయా కార్యాలయాల సిబ్బంది, పెద్దలక్ష్మీపురంలో ఎంపిపి రానా ఈశ్వరమ్మ, ఉదయ్ కుమార్, రామచంద్రాపురంలో జెడ్పిటిసి గూడ ఎండయ్య, వసుంధరలో మాజీ ఎంపిపి సలాన మోహన రావు, మెళియాపుట్టిలో ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రాజశేఖం రెడ్డిలకు పుష్పగుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


ఇచ్ఛాపురం : శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి సెక్రటరీ ఇందిరారెడ్డి పాఠశాల ఆవరణ మొక్కలను నాటారు. మేనేజర్ కే.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, శంకర్, శ్రీధర్, రోజారమణి, సునీత, ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ పి.తేజస్, సెక్రటరీ మోహన్ ప్రియ, జాయింట్ సెక్రటరీ డి.హర్షవర్ధన్రెడ్డి ఎస్.పి.ఎల్. జ్యోష్న పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని పూండిలో జెడ్పి వైస్ చైర్మన్ పాలిన శ్రావణి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివారావుకు అధికారులు, సర్పంచ్లు, ఎంపిటిసిలు తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

లావేరు: ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఇఆర్ను, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున తరలివెళ్లారు. తాళ్లవలసలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ ఇంటి వద్ద నూతన న్యూఇయర్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, మాజీ జెడ్పిటిసి రాజాపంతుల ప్రకాశరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


రణస్థలం రూరల్ : నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఎన్ఇఆర్


పలాస : శిరీషకు శుభాకాంక్షలు తెలుపుతున్న బాబూరావు దంపతులు


పలాస : అప్పలరాజు దంపతులకు సన్మానిస్తున్న నాయకులు


ఇచ్ఛాపురం : కేరింతలు కొడుతున్న విద్యార్థులు

దరఖాస్తులకు ఆహ్వానం

పొందూరు: మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత అధ్యాపక అతిధి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్లో 50 శాతం మార్కులను దాటి ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 4వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని ఆమె కోరారు. విశ్రాంత ఆచార్యులు, అధ్యాపకులు, జూనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని రాజపురం సబ్ స్టేషన్ పరిధిలోని భైరిపురం 11కెవి ఫీడర్ పరిధిలో విద్యుత్ స్తంభాలు మార్పులు కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా నెలవంక, కపాసుకుద్ది పంచాయతీల పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు, రాజపురంలోని శ్రీశయణ వీధికి విద్యుత్ సరఫరా నిలుపు దల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.


పెన్నులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుకన్య

పుస్తకాలు, పెన్నుల పంపిణీ

టెక్కలి రూరల్: మండలంలోని భగవాన్పురం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో టెక్కలి కళింగ వైశ్య సంఘం నాయకులు బుధవారం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పంగ సుకన్య, టిడిపి మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, స్కూల్ కమిటీ అధ్యక్షులు కొర్ను భవాని, టెక్కలి కళింగ వైశ్య సంఘం సభ్యులు టి.ఎస్.ఎన్.రమణ, కోరాడ రాంప్రసాద్, ఖండ్యన పేర్రాజు పట్నాన గణేష్, కొరాడ నాగభూషణ, ప్రధానోపాధ్యాయులు మొరాం కుమారస్వామి, సత్తారు పోలినాయుడు, పోలాకి ఈశ్వరరావు పాల్గొన్నారు.


రోగులకు పళ్లు పంపిణీ చేస్తున్న షణ్ముఖరావు

ప్రజా సేవే లక్ష్యం

పాతపట్నం: ప్రజా సేవే తన జీవిత లక్ష్యమని డాక్టర్ రేగేటి షణ్ముఖరావు అన్నారు. బుధవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా స్థానిక సిహెచ్లో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరాడంబర రాజకీయ నాయకుడిగా పేరు పొందిన డాక్టర్ జయప్రకాష్ నారాయణ స్థాపించిన లోక్ సత్తా పార్టీలో చేరి రాజకీయ జీవితాన్ని ప్రారంభించానన్నారు. ఎరుకోల వెంకటరమణ, మజ్జి భుజంగరావు, విశ్రాంత పోలీసు అధికారి శివాజీరెడ్డి, గంగు వాసు, బాడన తాతబాబు, బాబూరావు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న ఎస్ఐ రంజిత్

గంజాయి నియంత్రణపై దృష్టి

పోలాకి: గంజాయి అమ్మకాలు నియంత్రణపై దృష్టి సారించినట్లు ఎస్ఐ జి.రంజిత్ తెలిపారు. పోలాకి మార్కెట్లోని షాపులను బుధవారం తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాల, ఫోర్ వీలర్స్ వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేశారు. పోలీసులు వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సిపురం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గౌతు శిరీష


చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

మండలంలోని నర్సిపురం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నర్సిపురంలో టిడిపి నాయకులు రోణంకి వెంకటరమణ, వార్డు ఇన్చార్జి సిగటాపు ప్రకాష్ ఆధ్వర్యాన 150 మంది పేదలకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సిపురం కాలువలు బాగు చేస్తామని చెప్పారు. విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, మల్లిపెద్ది చిన్ని, సవర రాంబాబు, పుట్టలోకు, అనంతరావు, పడాల చిరంజీవి, మాజీ కౌన్సిలర్ నంబళ్ల వెంకటరావు, కిషోర్, రమేష్ పాల్గొన్నారు.

హెల్పింగ్ హేండ్స్ భరోసా

ప్రజాశక్తి- కవిటి

నూతన సంవత్సర వేడుకలను చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ ఆనంద ఉత్సవాలతో జరుపుకుంటుంటే ఎవరూ లేని అభాగ్యులకు తామన్నామంటూ హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ భరోసా కల్పించింది. మండలంలోని బొరివంకకు చెందిన హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ నూతన సంవత్సర వేడుకలను వినూత్నంగా నిర్వహించింది. సంస్థ సభ్యులే స్వయంగా ఆహారం తయారు చేసి కంచిలి, సోంపేట పరిధిలోని అభాగ్యులకు బుధవారం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యుడు కాశీ సాహు మాట్లాడుతూ ఏ దిక్కూ లేనివారికి తామున్నామనే భరోసా కల్పించడమే తమ లక్ష్యమని చెప్పారు. వారి పిల్లలతో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకోవడం తమకెంతో సంతృప్తి కలిగించిందని అన్నారు. కార్యక్రమంలో మున్నా, శ్యామ్ బిసాయి, నరసింహ, నవీన్, హరి బిసాయి పాల్గొన్నారు.


ఆహారం అందిస్తున్న సభ్యులు



రక్తదానం చేస్తున్న రామేశ్వరరావు

రక్తదానం మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి- పలాస

రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణం కాపాడుతుందని సత్యసాయి విద్యా విహార్ ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్లో నూతన సంవత్సరం సందర్భంగా కాశీబుగ్గ ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యాన బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్య సాయి ట్రస్టు ద్వారా ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తున్నామని చెప్పారు. రక్తం చేయడం ద్వారా చేసే వ్యక్తికి ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు అన్నారు. అనంతరం 25 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రాణదాత బ్యాంక్ మేనేజర్ సాయి మహంతి, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, వైస్ ప్రెసిడెంట్ తాళాసు శ్రీను, సురేష్ మాస్టర్, అనుదీప్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావద్దు

ప్రజాశక్తి- పలాస

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచి పనులు చేస్తూ ఈ ఏడాదంతా ముందుకు సాగాలని పొత్రియ సీయోను గ్రీస్ చర్చ్ ఫాస్టర్ సవర జగన్నాయకులు అన్నారు. మండలంలోని బాలాజీరులో బుధవారం క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి మార్గాన్ని ఎంచుకొని సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం గిరిజన బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కేక్ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. జగన్నాయకులు, కపాకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు సుబ్రరా, కేశవరావు, గున్నయ్య, మాధవరావు, తేజేశ్వరరావు, ప్రవీణ్, వాసుదేవరావు, సవర సురేష్, సవర కిరణ్, సవర సంజీవ్, సవర శేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగన్నాయకులు

ఆహార పొట్లాలు పంపిణీ

పలాస : మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు కాశీబుగ్గ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న పేదలకు బుధవారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. తల్లి దండ్రులు ఇచ్చిన డబ్బులను దాటుకుంటూ మిగిలిన డబ్బులతో ప్రతినెలా యాచకులకు, నిరుపేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తుంటారు. అందులో భాగంగా ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నట్లు సత్యసాయి విద్యా విహార్ ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి తెలిపారు.


ఆహార పొట్లాలను అందజేస్తున్న విద్యార్థులు

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎపి ఫార్మసీ అసోసియేషన్ కేలండర్ను ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమైనదన్నారు. ఎపి ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనెల గోపాల్, రెంటికోట వైద్యాధికారి టి.సునీల్కుమార్, డాక్టర్ మౌనిక, హెల్త్ సూపర్వైజర్ రిషికేశ్వరరావు, కామేశ్వర రావు, ఎఎంసి మాజీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, కుత్తుం లక్ష్మణ్, గురుటి సూర్యనారాయణ, అనిల్ శర్మ పాల్గొన్నారు.


నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

అచ్చెన్నాయుడు మృతి తీరనిలోటు

శ్రీకాకుళం అర్బన్: ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు, ఉపాధ్యాయ పత్రిక మాజీ సంపాదకులు సువ్వారి అచ్చెన్నాయుడు మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరనిలోటని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. బుధవారం నగరంలోని డిసిసిబి కాలనీలో గల ఆయన నివాసంలో అచ్చెన్నాయుడు పార్థీవదేహం వద్ద పుష్పగుచ్చం ఉంచి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలో జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. 96 ఏళ్ల వయసులో కూడా ఉపాధ్యాయ వృత్తిపై ఎంతో ఆసక్తి ఉన్న నాయకుడన్నారు. అంతిమ యాత్రలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి, జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్.వి అనిల్ కుమార్, సీనియర్ నాయకులు కె.గోవిందరావు, పి.లక్ష్మణరావు, వెంకటపతి రాజు, సిహెచ్ అచ్యుతరావు, జి.వి రమణ, కె.వి రమణ, పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.


ధ్వంసమైన సింహం విగ్రహం

సింహం విగ్రహం ధ్వంసం

పొందూరు: మండలంలోని కనిమెట్ట శివాలయం ముందు సింహం విగ్రహాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని ఆకతాయిలు ధ్వంసం చేశారు. బుధవారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు ఆలయం ముందు ఉన్న సింహం విగ్రహం ధ్వంసమైనట్టు గుర్తించారు. సింహం విగ్రహం ధ్వంసం కావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అత్యంత పురాతన ఆలయాల్లో కనిమెట్ట శివాలయం ఒకటి, కనిమెట్టతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన యాత్రికులు ఈ ఆలయానికి అధిక సంఖ్యలో వస్తారు. పురాతన ఆలయంలో విగ్రహం ధ్వంసంతో యాత్రికుల మనోభావాలు దెబ్బ తిన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేత్రాలు సజీవం


శ్రీరామమూర్తి (ఫైల్)

శ్రీకాకుళం అర్బన్: నగరం లోని కంపోస్ట్ కాలనీలో నివాస ముంటున్న పేకల శ్రీరామమూర్తి ఇటీవల మృతి చెందారు. ఆయన నేత్రాలను కుమారులు లక్ష్మణరావు, హేమ సుందరావు, తేజేశ్వర రావులు రెడ్క్రాస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. రెడ్క్రాస్కు చెందిన నేత్ర సేకరణ విభాగం టెక్నీషియన్ పూతి సుజాత నేతృత్వాన రెటీనాను సేకరించి విశాఖపట్నం ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు. వీరిని రెడ్క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అభినందించారు.

నేడు శిక్షణ

మెళియాపుట్టి : మండలంలోని చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్ఎంసి చైర్మన్లకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంఇఒలు ఎస్.దేవేందర్, ఎం.పద్మనాభరావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. సకాలంలో శిక్షణలో పాల్గొవాలని సూచించారు.